క్లుప్తంగా

నేడు అనకాపల్లిలో వీహెచ్‌పీ కార్యకర్తల సమావేశం

మాడుగుల రూరల్ : విశ్వహిందూ పరిషత్ కార్యకర్తల సమావేశం అనకాపల్లిలో ఆదివారం నిర్వహిస్తున్నట్టు జిల్లా విశ్వ హిందూ పరిషత్ ఉపాధ్యక్షుడు రాపేట రామకొండలరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనకాపల్లిలో మల్లిమణుగులవారి వీధిలో గల శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ సమావేశం జరుగుతుందని ప్రఖండ అధ్యక్ష, కార్యదర్శులు, ఆయా ప్రముఖ్‌లు, పూర్తి సమయ కార్యకర్తలు హాజరుకావాలని, ముఖ్య వక్తలుగా సింహాద్రి ఫాల్గుణరావు, రాళ్లపల్లి పాపయ్యశర్మ హాజరవుతారని తెలిపారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిలిపివేయాలి



నగరంలో నిరసన తెలుపుతున్న చిరంజీవి, తదితరులు

మాకవరపాలెం: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వెంటనే నిలిపివేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని జి.నగరంలో శనివారం ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన వ్యక్తం చేశారు. ఎస్సీలకు ఉన్న 29 రకాల సంక్షేమ పథకాలను కొనసాగించడంతోపాటు 350 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దళితవాడల అభివృద్ధికి వినియోగించాలన్నారు.

ముగిసిన లక్ష్మీనారాయణస్వామి కల్యాణోత్సవాలు

మాడుగుల రూరల్ : ఎం. కోడూరు గ్రామంలో లక్ష్మీనారాయణ స్వామి కల్యాణోత్సవాలు శనివారంతో ముగిసాయి. శనివారం ఉదయం నుంచి స్వామి వారికి పూజలు, అభిషేకాలు, సాయంత్రం 7 గంటల నుంచి లక్ష్మీనారాయణ స్వామి, లక్ష్మీదేవి ఉయ్యాల సేవ నిర్వహించారు. జాజిమొగ్గల శ్రీనివాస్, హేమ దంపతులు సారథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


నేరాలపై అవగాహన పెంచేందుకు కృష్ణదేవిపేటలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన దృశ్యం

గొలుగొండ : ప్రతి ఒక్కరూ నేటి సమాజంలో జరుగుతున్న మోసాలపై అప్రమత్తంగా ఉండాలని కృష్ణదేవిపేట ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్ ప్రధాన కూడళ్ల వద్ద నేరాలపై ప్రజలకు అవగాహన కోసం ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అల్లూరి సీతారామరాజు వర్తక సంఘం సభ్యులు సహకారంతో క్రైమ్, సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న దాడులపై ప్రజలు అవగాహన కోసం వీటిని ఏర్పాటు చేశారు. వీటికి సహకారం అందించిన వర్తక సంఘం సభ్యులను అభినందించారు.

8 మందికి వినికిడి యంత్రాల పంపిణీ


వినికిడి యంత్రాలను అందిస్తున్న శ్రీకాంత్, మంగపతి

కె.కోటపాడు : వినికిడి సమస్యలతో ఇబ్బందులు పడుతుండేవారు ప్రాథమిక దశలోనే మెరుగైన వైద్యం పొందాలని ఆడియాలజిస్ట్ శ్రీకాంత్ అన్నారు. కె.కోటపాడులో శనివారం వినికిడి సమస్యలు గల వారికి ఆయన వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 8 మందికి వినికిడి యంత్రాలు అవసరంగా గుర్తించారు. సంఘమిత్ర రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరం ద్వారా ఒక్కొక్కరికీ రూ.20వేలు విలువైన వినికిడి యంత్రాలను ఆడియాలజిస్ట్ శ్రీకాంత్ అందించారు. కార్యక్రమంలో సంఘమిత్ర సొసైటీ కార్యదర్శి బొంతు మంగపతి, మండల మురళీ కృష్ణ, కన్నూరు అప్పలనాయుడు పాల్గొన్నారు.

కాలుష్య నివారణ అందరి బాధ్యత


మాకవరపాలెంలో మొక్కలు నాటుతున్న ప్రత్యేక అధికారి రామ్మోహన్‌రావు

మాకవరపాలెం: కాలుష్య నివారణ అందరి బాధ్యత అని మండల ప్రత్యేక అధికారి రామ్మోహన్ రావు అన్నారు. ప్లాస్టిక్ రహిత గ్రామాలే లక్ష్యంగా శనివారం ఉన్నత పాఠశాల విద్యార్థులతో తామరం నుంచి మాకవరపాలెం వరకు ర్యాలీ నిర్వహించారు. ముందుగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటిన అనంతరం ర్యాలీ, మానవహారంగా ఏర్పడ్డారు. ఎంపీడీవో సీతామహాలక్ష్మి, ఎంఈవో మూర్తి పాల్గొన్నారు.

ఎట్టకేలకు రహదారి సమస్యకు తెర


నిర్మాణంలో ఉన్న గిడుతూరు-సుంకపూరు రోడ్డు


వంతెన లేక ముందు నదిలో నుంచి పొలాలకు వెళుతున్న రైతులు(ఫైల్)

- రూ.కోటి 80 లక్షలతో గిడుతూరు-సుంకపూరు రోడ్డు నిర్మాణం
- గత ప్రభుత్వ హయాంలోనే నిధుల మంజూరు
- ముమ్మరంగా జరుగుతున్న పనులు

మాకవరపాలెం : మండలంలోని గిడుతూరు సమీపంలో వరాహనది ఉంది. ఇది వర్షా కాలంలో ఉధృతంగా ప్రవహిస్తుంది. ఈ సమయంలో నది అవతల వ్యవసాయ భూములు ఉన్న వారంతా అవతలకు వెళ్లేందుకు అవకాశం ఉండదు. ఈ పరిస్థితుల్లో పొలాల్లో ఉన్న పశువులకు సైతం గ్రాసం వేసే వీలూ ఉండదు. ఏళ్ల తరబడి నది అవతల పొలాలు ఉన్న రైతులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. 2012లో కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 85 లక్షలు మంజూరు చేసి నదిపై వంతెన నిర్మించింది. అయితే వరహానదిపై నిర్మించిన ఈ వంతెన నుంచి అవతలకు వెళ్లేందుకు అప్రోచ్ రోడ్డును వేయకపోవడంతో వంతెన వృధాగా మారింది. 2019కి మునుపు ఉన్న కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు పట్టించుకోలేదు. అధికారులు అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి టీడీపీ ప్రభుత్వ హయాంలోనే రూ.46 లక్షలు అవసరమని ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు చేయలేదు. దీంతో గిడుతూరుకు చెందిన అధిక సంఖ్యలో రైతులకు నది అవతల భూములు ఉన్నందున వర్షాకాలంలో అక్కడకు వెళ్లేందుకు ఇబ్బందులు పడేవారు. నీరు అధికంగా ప్రవహిస్తే ఈ రైతులు పెదబొడ్డేపల్లి మీదుగా కోటవురట్ల మండలం సుంకపూరు గ్రామం నుంచి పొలాలకు చేరుకోవాల్సివచ్చేది.

రైతుల ఇబ్బందులను గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం..

గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ స్థానిక నేతలతో కలిసి ఈ వంతెనను పరిశీలించారు. సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. గిడుతూరు నుంచి కోటవురట్ల మండలం సుంకపూర్ వరకు రెండున్నర కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.కోటి 80 లక్షలు నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులతో ప్రస్తుత ప్రభుత్వం రోడ్డు పనులు చేపట్టింది. దీంతో ఏళ్ల నాటి కల నెరవేరిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్లాస్టిక్ నియంత్రణ అందరి బాధ్యత


చోడవరంలో మానవహారం చేస్తున్న ఎమ్మెల్యే రాజు, ప్రజాప్రతినిధులు, అధికారులు

చోడవరం: ప్లాస్టిక్ నియంత్రణపై అందరూ బాధ్యత తీసుకోవాలని ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు కోరారు. ప్లాస్టిక్‌ను నియంత్రించాలని కోరుతూ చోడవరం ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని నినాదాలు చేశారు. ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ పర్యావరణాన్ని నాశనం చేస్తున్న ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా అందరూ నిషేధించాలన్నారు. కార్యక్రమంలో సీఐ అప్పలరాజు, ఎంపీపీ గాడి కాసు, ఎంపీడీఓ ఆంజనేయులు, పంచాయతీ ఈఓ నారాయణరావు, టౌన్ అధ్యక్షుడు దేవరపల్లి వెంకటఅప్పారావు, గరల్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రామిరెడ్డి, చైర్మన్ సత్తిబాబు పాల్గొన్నారు. గోవాడ గ్రామంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్రకార్యదర్శి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నియంత్రపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, పంచాయతీ పాలక వర్గం, సిబ్బంది పాల్గొన్నారు.

సారా నిర్మూలనపై కళాజాతా


సారా నిర్మూలిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి సర్పంచ్ గంగరాజు ఎక్సైజ్ ఎస్ఐ రహీమ్

నాతవరం : నాటు సారా తాగడం వల్ల ఆరోగ్యాన్ని చేజేతులా నాశనం చేసుకోవడం జరుగుతుందని గొలుగొండ ఎక్సైజ్ ఎస్ఐ ఎస్.కె.రహీం అన్నారు. సరుగుడు గ్రామంలో శనివారం నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ గొల్లపల్లి గంగరాజు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. సారా నిర్మూలనపై కళాజాతా నిర్వహించి ప్రజాప్రతినిధులు అధికారులు గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎస్ఐ రహీమ్ మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో గ్రామసభలు నిర్వహించి నాటు సారా నిర్మూలించేందుకు అంతా సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు పలు గ్రామాల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహించగగా, ఆయా గ్రామాల్లో చాలా వరకు సారా తయారీ, విక్రయాలు తగ్గాయన్నారు. నిబంధనలు ఉల్లంఘించి ఇంకా ఎవరైనా సారా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

ఇంకుడుగుంతలతో భూగర్భ జలాలు మెరుగు


గుల్లేపల్లిలో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న పీడీ పూర్ణిమాదేవి

కె.కోటపాడు : ఇంటి పరిసరాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాలను చేపట్టడం ద్వారా భూగర్భ జలాలు మెరుగుపడతాయని డ్వామా పీడీ ఆర్.పూర్ణిమాదేవి అన్నారు. మండలంలో గుల్లేపల్లి, చౌడువాడ గ్రామాల్లో శనివారం పర్యటించిన ఆమె ఇంకుడు గుంతలు, ఎరువు గుంతల నిర్మాణాలను పరిశీలించారు. ఉపాధి హామీ పథకంలో కొలతల మేరకు ఇంకుడు గుంతల నిర్మాణం జరిపితే ఒక్కో నిర్మాణానికి రూ.6500 నగదు అందించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు ఇంకుడు గుంతల నిర్మాణం కోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం చౌడువాడ గ్రామంలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఏపీడీ శ్రీనివాసరావు, సర్పంచ్ ఎరుకునాయుడు, పంచాయితీ కార్యదర్శి సురేష్, ఏపీవో అప్పలరాజు పాల్గొన్నారు.

సుగర్ ఫ్యాక్టరీని ఆధునికీకరించాలి


మేడిచర్లలో రైతులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కె.కోటపాడు : గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఆధునికీకరణకు ప్రభుత్వం తక్షణం రూ.350 కోట్లు మంజూరు చేయాలని సీపీఎం మండల నాయకుడు గండి నాయినిబాబు అన్నారు. మండలంలో ఎ.కోడూరు, ఎ.భీమవరం, మేడిచర్ల గ్రామాల్లో శనివారం ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయినిబాబు మాట్లాడుతూ ఇప్పటి వరకూ రైతులకు బకాయిలు ఉన్న రూ.35 కోట్లు కూడా చెల్లింపులు జరిపాలన్నారు. మేడిచర్ల చెరకు కాటా వద్ద అన్‌లోడింగ్ జరగక రైతులు తీసుకువచ్చే చెరకు యార్డ్‌లో ఎండిపోతోందని, వెంటనే కాటాల వద్ద చెరకును ఫ్యాక్టరీకి తరలించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు యర్రా దేముడు, ఈర్లె నాయుడుబాబు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు

మాడుగుల రూరల్ : ఈ నెల 17 వ తేది నుంచి జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించనున్నట్టు కె.జె.పురం పది పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ బావరాజు అప్పారావు అన్నారు. శనివారం ఆయన పరీక్ష కేంద్రంలో రోల్ నెంబర్లు వేయించారు. కేంద్రంలో 162 మంది రెగ్యులర్, ఏడుగురు ప్రైవేటు విద్యార్థులు హాజరవుతున్నట్టు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

దేవరాపల్లి: ఈ నెల 17 నుంచి జరిగే పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా జరిపించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మండల విద్యాశాఖ అధికారి-1 బి.పడాల్‌దాస్ తెలిపారు. స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో శనివారం ఆయన వివరాలను వెల్లడించారు. దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తెనుగుపూడి అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలోను టెన్త్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మండల వ్యాప్తంగా 434 మంది ప్రభుత్వ, ప్రైవేటు పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు.

పంతాలతో సమస్యలు మరింత జటిలం

నాతవరం : పంతాలు పట్టింపులకు పోతే సమస్య మరింత జటిలం అవుతుందని మండల ప్రత్యేకాధికారి నాగశిరీష అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పీజీఆర్ఎస్ ఫిర్యాదుదారులతో సమావేశం నిర్వహించారు. ముందుగా పంచాయతీల వారీగా దరఖాస్తులు పరిశీలించి ఇరువర్గాలకు కౌన్సెలింగ్ చేశారు. కలెక్టరు ఆదేశాల ప్రకారం ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపి నిబంధనల మేరకు చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.వేణుగోపాల్, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండ్ పోలుపర్తి పార్థసారథి డిప్యూటీ తహసీల్దార్ టి.వి.ఎల్.రాజు, జేఈలు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణకు కమిటీ


కొమరవోలు సచివాలయం వద్ద అవగాహన సదస్సులో మాట్లాడుతున్న లోవరాజు

రోలుగుంట: కొమరవోలు పంచాయతీలో బాల్య వివాహాలు గుర్తించి, అరికట్టడానికి చైల్డ్ మ్యారేజి ఫౌండేషన్ అండ్ మోనిటరింగ్ ఆధ్వర్యంలో 11 మందితో కమిటీని నిర్వాహకుడు లోవరాజు శనివారం ఏర్పాటు చేశారు. సచివాలయం వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా బడిబయట పిల్లలను గుర్తించాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను గుర్తించి అందరినీ చైతన్య పరచాలన్నారు. బాలికలకు రక్షణగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్లు 1098, 112 గురించి వివరించారు. సమావేశంలో సర్పంచ్ రమణమ్మ, ఎంపీటీసీ సభ్యుడు వెంకట రామన్, పంచాయతీ కార్యదర్శి హైమావతి, ఏఎన్ఎంలు పార్వతి రాజేశ్వరి, అంగన్‌వాడీ వర్కర్లు కృష్ణవేణి, అనంత, జయలక్ష్మి పాల్గొన్నారు.

మండల సమావేశానికి అధికారులు విధిగా హాజరవ్వాలి


సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు, ఎంపీపీ జగన్‌మోహన్

కె.కోటపాడు : ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. సమావేశంలో ఉద్యానవనశాఖకు సంబంధించి సంబంధిత అధికారి హాజరుకాకపోవడాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే బండారు అన్నారు. స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 5 నుంచి నిర్వహిస్తున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను మండల వ్యాప్తంగా 10799 మంది రైతులకు పూర్తి చేసినట్టు తెలిపారు. మండలంలో 8089 మంది రైతులు పీఎం కిసాన్ పథకం ద్వారా పెట్టుబడి సహాయం పొందుతున్నారని తెలిపారు. చెరకు పంట గిట్టుబాటు కాకపోవడంతో రైతులు సాగుకు ఆసక్తి చూపడం లేదని, ప్రత్యామ్నాయ పంటలను ప్రభుత్వం ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని చౌడువాడ ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్ కోరారు. చెరకు సాగుతో పాటు మొక్కజొన్న పంట సాగుపై రైతులు ఆసక్తిని చూపాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. మొక్కజొన్న సాగు ద్వారా ఆరు నెలల కాలంలోనే ఎకరాకు రూ.60వేల ఆదాయం పొందవచ్చని సూచించారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆదుకుంటామన్నారు. రైత్వారీ ఇనాం భూములు గల రైతులు పాస్ పుస్తకాలకు దరఖాస్తు చేసుకుంటే నిబంధనల మేరకు అర్హతను బట్టి పాస్ పుస్తకాలను ఇచ్చే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రమేష్‌బాబు తెలిపారు. లంకవానిపాలెం గ్రామంలో కొంత మేరకు ఇంటింటి కుళాయిల నిర్మాణాలు జరగలేదని, గ్రామంలో ఉపాధి పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ దొరబాబు కోరారు. పలు గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ నిధులతో పనులు ప్రారంభించేందుకు టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే కుళాయిల నిర్మాణాలు పూర్తి చేయడం జరుగుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్ తెలిపారు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్ పి.వి.జి. కుమార్, రొంగలి మహేష్, ఎంపీడీవో సాంబశివ రావు, తహసీల్దార్ రమేష్‌బాబు, సూపరింటెండెంట్ అప్పలరాజు పాల్గొన్నారు.

సంకల్పం ఉంటే ఉద్యోగం సాధ్యమే

సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ ఆఫ్ ఇండియా అడిషనల్ డైరెక్టర్ సురేష్


సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌టీపీఐ అడిషనల్ డైరెక్టర్ సురేష్

నర్సీపట్నం : ఉద్యోగం సాధించాలంటే సంకల్పం ఉండాలని సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ ఆఫ్ ఇండియా అడిషనల్ డైరెక్టర్ బి.సురేష్ పేర్కొన్నారు. శనివారం నర్సీపట్నంలో అవంతి విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన హ్యూమన్ రిసోర్స్ నిర్వహణ అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ ఇండియా వ్యవస్థాపన అభివృద్ధి సంస్థ వినూత్న ప్రాజెక్టులను ప్రోత్సహిస్తుందన్నారు. అందులో భాగంగానే లక్ష ప్రాజెక్టు నుంచి 1200 వినూత్న ప్రాజెక్టులను ఎంపిక చేశామన్నారు. మంచి ఉద్యోగం సంపాదించాలంటే కష్టపడే సంకల్పం ఉండాలన్నారు. అంకిత భావంతో సాధన చేస్తే సత్ఫలితాలు సాధించవచ్చన్నారు. అనంతరం అవంతి విద్యా సంస్థల వ్యవస్థాపకుడు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, టెక్‌మహీంద్రా సీఈవో వెంకటగజ్జల, హెచ్‌ఆర్ జితేంద్రసింగ్, హెచ్‌సీఎల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సు దూండి బాలచక్రధర్ విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు.

రోడ్లపై చెత్త వేస్తే జరిమానా


దేవరాపల్లిలో దుకాణాల ఎదుట చెత్తను తొలగింపు చేస్తున్న డీఎల్‌డీవో మంజులవాణి తదితర్లు

దేవరాపల్లి : రోడ్ల ఇష్టానుషారంగా చెత్తా చెదారం వేస్తే సదరు షాపు యజమానులకు జరిమానా విధిస్తామని డీఎల్‌డీవో మంజులవాణి అన్నారు. 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' కార్యక్రమంలో భాగంగా శనివారం దేవరాపల్లిలో ఎంపీడీవో సువర్ణరాజు, ఇతర శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించి, ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో మానవహారంగా ఏర్పడ్డారు. మెయిన్ రోడ్లలో దుకాణాలను, కాయగూరల మార్కెట్‌ను సందర్శించి పరిశుభ్రత పాటించని షాపు యజమానులకు హెచ్చరికలు చేశారు. ప్రతి దుకాణదారు విధిగా చెత్త డబ్బాలను ఉంచాలని సూచించారు. సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఏపీఎం ఎస్.ప్రభాకర్, హౌసింగ్ ఏఈ భవ్యతేజ, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ త్రినాథ్ పాల్గొన్నారు. బోయిలకింతాడలో సర్పంచ్ బూరె బాబూరావు ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, గ్రామస్తులు, పారిశుధ్య సిబ్బందితో కలసి చెత్తాచెదారాలను, డ్రైనేజీల్లో పూడికలను తొలగించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జామి అప్పారావు పాల్గొన్నారు.

కాటాల వద్ద ఎండుతున్న చెరకు


జి.నాయుడుపాలెం చెరకు కాటా వద్ద కొన్ని రోజులుగా నిలిచిపోయిన చెరకు బళ్లు

రోలుగుంట: గోవాడ సుగర్స్ ఫ్యాక్టరీ యాజమాన్యం కాటా వద్ద ఎండుతున్న చెరకును వెంటనే ఫ్యాక్టరీకి తరలించకపోతే ఆందోళనకు దిగుతామని చెరకు రైతులు హెచ్చరించారు. ఈ కాటాలో (చెరకు కొనుగోలు కేంద్రం) గోవాడ సుగర్స్ ఫ్యాక్టరీలో సభ్య రైతులకు ఫీల్డ్‌మెన్ పంపిణీ చేసిన చెరకు పర్మిట్లకు రైతులు వారం రోజులుగా చెరకును జి.నాయుడు పాలెం కాటా వద్దకు తరలిస్తున్నారు. కాటా వద్ద చెరకు బళ్ల సంఖ్య రోజు, రోజుకూ పెరుగుతుందే గాని ఫ్యాక్టరీకి చెరకు తరలించేందుకు లారీలు రావడం లేదు. దీంతో చెరకు ఎండిపోయి, చెరకులో రసం తగ్గిపోయి రైతులకు తీవ్ర నష్టం ఏర్పడుతుంది. ఫ్యాక్టరీ యాజమాన్యం వెంటనే లారీలు కాటాకి పంపించి చెరకును తరలించకుంటే తమకు జరిగే నష్టానికి, కష్టానికి యాజమాన్యం, అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని రైతులు హెచ్చరిస్తున్నారు. దీనిపై సాక్షి రోలుగుంట ఏరియా కేన్ ఇన్‌స్పెక్టర్‌ని ఫోన్‌లో సంప్రదించగా తాను సెలవుపై యాత్రలో ఉన్నానని, సమస్య ఎండీకి నివేదించినట్టు తెలిపారు.

చైతన్య గొంప చారిటీ ట్రస్టు వితరణ


పేదలకు ఆర్థిక అందిస్తున్న ట్రస్టు వ్యవస్థాపకుడు కరుణాకర్‌రావు

దేవరాపల్లి: దేవరాపల్లిలోని చైతన్య గొంప చారిటీ ద్వారా ట్రస్టు వ్యవస్థాపకుడు ఎల్లేటి కరుణాకర్ రావు ప్రతి ఏటా మాదిరిగా విద్య, వైద్యం నిమిత్తం ముగ్గురికి ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన స్వగృహంలో శనివారం నగదును అందజేశారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న దేవరాపల్లికి చెందిన చల్లా పార్వతికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10వేలు, తాటికొండ శ్రావణికి విద్య నిమిత్తం రూ.10వేలు, విజయనగరం జిల్లా జామి గ్రామానికి చెందిన జామి సూర్యశ్రీ శివానికి చదువు నిమిత్తం రూ. 25వేలు చెక్కులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో దేముళ్లు, సత్తిబాబు, బాబ్జి, సత్తిరాజు తదితర ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్‌లో భాగస్వాములు కండి


ఎంఈవో కార్యాలయం వద్ద చెత్తను శుభ్రం చేస్తున్న ఎంఈవోలు


గుల్లేపల్లిలో అవగాహన ర్యాలీ


బుచ్చెయ్యపేటలో మానవహారం


కె.జె.పురంలో అవగాహన ర్యాలీ

నాతవరం : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు అందరు సమష్టిగా కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి నాగశిరీష అన్నారు, మండల కేంద్రంలో శనివారం ప్రధాన కూడలి జంక్షన్‌లో విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛతా దివస్ నిర్వహించారు. ఎంఈవోలు కె.సత్యనారాయణ, వరహాలబాబు పాల్గొన్నారు.

గొలుగొండ : గొలుగొండ, కృష్ణదేవిపేట అటవీ రేంజ్ పరిధిలో శనివారం స్వచ్ఛ దివస్ నిర్వహించారు. గొలుగొండ అటవీశాఖ కార్యాలయంతో పాటు పరిసరాలను పరిశుభ్రం చేశారు. కృష్ణదేవిపేట రేంజర్ శ్రీనివాసరావు, డిప్యూటీ రేంజర్ సత్యనారా యణ, గొలుగొండ సెక్షన్ అధికారి లక్ష్మణ్, పాల్గొన్నారు.

మాడుగుల : వీరనారాయణం గ్రామంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా పోలీసు రాజ్యలక్ష్మి మాట్లాడారు. ప్రతి ఇంటి ముందు శుభ్రత పాటించాలన్నారు. తడిపొడి చెత్త వేరు చేసి చెత్తబండికి అందజేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

రావికమతం: స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో శనివారం ఎంపీడీవో వెంకన్నబాబు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సూపరింటెండెంట్ సీతారామస్వామి, ఈవోపీఆర్‌డీ భానోజీరావు పాల్గొన్నారు. తహసీల్దార్ బి.వెంకటరమణ, ఉప తహసీల్దారు అప్పలనాయుడు సారథ్యంలో మేడివాడలో జీడిపిక్కల కార్మాగారంలో పనిచేస్తున్న మహిళా కార్మికులతో స్వచ్ఛాంధ్రపై ప్రతిజ్ఞ చేయించారు.

బుచ్చెయ్యపేట : మండలంలో అన్ని గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్యం పాటించాలని ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. శనివారం బుచ్చెయ్యపేటలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నాలుగు రోడ్ల జంక్షన్‌లో మానవ హారంగా ఏర్పడ్డారు. తహసీల్దార్ లక్ష్మి, ఈవోపీఆర్డీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

కె.కోటపాడు : ఇంటి పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచాలని గుల్లేపల్లి గ్రామ సర్పంచ్ బండారు దేముళ్లు అన్నారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ, పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించారు సీహెచ్‌సీలో వైద్య సిబ్బంది ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రం చేసి, ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు. సూపరింటెండెంట్ శ్రీలక్ష్మి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాడుగుల రూరల్ : కె.జె.పురం గ్రామంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ రమణబాబు ఆధ్వర్యంలో పరిశుభ్రతా చర్యలు చేపట్టారు. కార్యదర్శి నవీన్‌దొర, సత్యనారాయణ పాల్గొన్నారు.

రోలుగుంట : కొవ్వూరు గ్రామంలో శనివారం మండలంలో గల అన్ని శాఖల అధికారులతో స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఎంపీడీవో నాగేశ్వరరావు నిర్వహించారు. స్వచ్ఛతా కార్యక్రమంలో తాను భాగస్వామినవుతానని చెత్త నుంచి సంపద తయారీశాల వద్ద ప్రత్యేకాధికారి రామ్మోహన్ ప్రతిజ్ఞ చేయించారు.

చీడికాడ : మన గ్రామాన్ని మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ హేమసుందరరావు అన్నారు. ఖండివరంలో స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పలు వీధుల్లో చెత్తను సేకరించారు. సీడీసీ ఛైర్మన్ శ్రీనివాసరావు, కో-ఆప్షన్ మెంబర్ షేకు సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ కళావతి పాల్గొన్నారు.

విద్యార్థులకు గ్రంధివాపు పరీక్షలు


విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ ధీరజ్

మాకవరపాలెం : విద్యార్థులకు గ్రంధి వాపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. నేషనల్ అయోడిన్ డెఫిసెన్సీ డిసార్డర్ ప్రోగ్రాం(ఎన్ఐడీడీపీ) లో భాగంగా శనివారం ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో ఉన్న 6 నుంచి 12 ఏళ్లలోపు విద్యార్థులకు గ్రంధి వాపు పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి ధీరజ్ 90 మంది విద్యార్థులకు పరీక్షలు చేసి గ్రంధి వాపు వల్ల కలిగే ఇబ్బందులపై అవగాహన కల్పించారు. ఈ వాపు లక్షణాలు, నివారణ చర్యలపై వివరించారు. గ్రంధివాపు వచ్చినట్టు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రమేష్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.